

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### "వందేళ్ళ సినిమా!"

**'హరిశ్చంద్ర' అనే మూకీ సినిమాగా** పుట్టిన బిడ్డ 'అలం అర'నుండీ మాటలు నేర్చి, ఆటపాటలతో మనని తరతరాలుగా అలరిస్తూ వందో పుట్టినరోజు జరుపుకుంటున్న శుభ సందర్భం ఇది. ఇందులో పాలుపంచుకోవడం నా పూర్వజన్మసుకృతం.

ఉత్తరాదిన ఒకసారీ, దక్షిణాదిన ఒకసారీ ఈ పండుగ జరుపుకున్నారు. దక్షిణాది భారతీయ ఫిల్మ్‌చాంబర్ వాళ్ళు ఈ నెల అనగా సెప్టెంబర్ 21 నుండీ 24 వరకూ ఈ ఉత్సవాలు జరపడానికి నిర్ణయించారు.

21న తమిళ సినిమాతో ఈ వందేళ్ళ పండుగ ప్రారంభమయింది. మనకి రాచరికపు వ్యవస్థ లేదే కీలుగుర్రం, గులేబకావళీ కథల్లో ఉన్న రాణుల్ని చూడలేదే అన్న బెంగ మన తరం వారికి ఉంటే, అది రూపుమాపడానికే 'సెల్వి' పురుచ్చి తలైవి అని పిలవబడే మన తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితని ఆ దేవుడు సృష్టించాడు. మేం 22 ప్రొద్దుట హైదరాబాద్ నుండి ఇండిగో విమానం ఎక్కి బయలుదేరాం. ఆ రోజు విమానాశ్రయం ఎలా ఉందంటే పగలే చుక్కలు పొడిచినట్లు. ఇంతమంది స్టార్స్‌తో దేదీప్యమానంగా వెలిగిపోయింది. 8.30 AM ఫ్లయిట్‌లో కొంతమందీ, తరువాత 9.55 AM ఫ్లయిట్‌లో కొంతమంది సినిమా ఇండస్ట్రీలో ఉన్న ప్రముఖులంతా కలిసి షంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో సందడి చేసారు.



శిల్పాచక్రవర్తి ఫోన్ చేసి "రెడ్ కార్పెట్ మీద అతిథులని ఇన్‌వైట్ చెయ్యాలి కొన్ని పాయింట్స్ చెప్పండి మేడం" అంది. తనది నా ముందు ఫ్లయిట్. కొన్ని పాయింట్స్ చెపితే నోట్ చేసుకుంది. తెలుగు పిల్లలకన్నా ఆ బెంగాలీ అమ్మాయి చాలా చక్కగా తెలుగు మాట్లాడుతుంది. నేను కొద్దిగా త్వరగా వెళ్ళడం వలన టీ.వీ కళాకారుల్ని కూడా కలవడం తటస్థించింది. ఆ రోజు వాళ్ళు అందరూ కూడా ఏవో ఇంటర్ ఛానెల్ కాంపిటీషన్స్ కోసం చెన్నై వెళ్తున్నారు.

సుద్దాల అశోక్‌తేజగారూ, వారి శ్రీమతి నిర్మలా, నేనూ బ్రేక్‌ఫాస్ట్ చేసి బయలుదేరదాం అని ఎయిర్ పోర్ట్‌లో టిఫిన్ చేస్తుంటే, దోశ వేసే అబ్బాయి "ఇంత మంది సినిమా స్టార్స్ అంతా కలిసి ఎక్కడికి వెళ్తున్నారు మేడం?" అని అడిగాడు. "సినిమా సెంటీనరీ సెలబ్రేషన్స్‌కి" అన్నాను.

"ఆ సెలెబ్రేషన్‌లో మేమూ పార్టిసిపేట్ చేస్తున్నట్లుంది" అన్నాడు అతను ఆనందంగా.

నాతో కలిసి ఆ రోజు ఫ్లయిట్‌లో ప్రయాణం చేసిన ముఖ్యులు రావు బాలసరస్వతిగారు, కె.యల్.నారాయణగారు, కె.ప్రతాప రాఘవగారు, పి.సాంబశివరావుగారు, భగీరథగారు, ఎమ్.ఎస్.రాజుగారు, శివాజీరాజా, తరుణ్, శివకృష్ణ, నారాయణరావు, కృష్ణవేణి, కైకాల సత్యనారాయణగారు, సుద్దాల అశోక్ తేజ, పి.జె.శర్మగారు, బి.గోపాల్ గారు, శీనూ వైట్ల, వెంకటేష్, మాడా, కె. బ్రహ్మానందం, అల్లరి నరేష్, పేకేటి రంగా, మురళీ మోహన్, డా. డి.వి.ఎన్ రాజుగారు, అనురాధా దేవి, రాజేంద్ర ప్రసాద్, చోటా కె.నాయుడు, శ్రీకాంత్, బాబూ మోహన్, కోట శ్రీనివాసరావుగారు, చలపతి రావుగారు, భాస్కర రాజుగారు, శేఖర్ బాబుగారు, కృష్ణంరాజుగారు, కోదండ రామిరెడ్డిగారు, మంచు మనోజ్, సురేష్ కొండేటి, చార్మీ, పూరి జగన్నాధ్ సత్యానంద్‌గారు, సింగీతం శ్రీనివాసరావుగారూ, తమన్, మారుతి తదితరులు. ఇంకా చాలామంది పేర్లు నాకు తెలీదు. చాలా సీనియర్ టెక్నీషియన్స్ ఉన్నారు.

నా పక్కన డా.డి.వి.ఎన్ రాజుగారు (దాట్ల వెంకట నరసింహ రాజుగారు) పేకేటి రంగా కూర్చున్నారు. డాక్టర్ గారు సింహబలుడూ, (ఎన్.టి.ఆర్ తో) ఇంటి గుట్టు (చిరంజీవి తో) మొదలైన సినిమాలు చాలా తీసారు. ఆయనతో నేను కబుర్లలో పడితే, అరవై సంవత్సరాల సినిమా చరిత్రని తిరగతోడాము. ఆయన సావిత్రిగారికి వచ్చిన వ్యాధి గురించి చెపుతూ Musculer istrophy అనే వ్యాధి కోట్లమందిలో ఒక్కళ్ళకి వస్తుంది. అది మనదురదృష్టం కొద్దీ మన మహానటికి వచ్చింది. కండరాలు హారతికర్పూరంలా హరించుకుపోతాయి. ఎముకలు రబ్బరులా మెత్తబడిపోతాయి. దానికి మందు ఇంకా కనిపెట్టలేదు అని చెప్పారు. ఇండస్ట్రీలో ఆ తరం ప్రముఖులకి చాలామందికి ఈయన వైద్యం చేశారు. జయలలితగారి తల్లికి కూడా ఈయనే వైద్యులు. డాక్టర్ గారు ఇప్పటిదాకా రెండే కార్లు వాడారంట. ఒకటి మద్రాసులో ఉన్నప్పుడు ఎంబాసిడర్ కారు, హైదరాబాదు షిఫ్ట్ అయ్యాక ఫస్ట్ బాచ్ మారుతీ కారు. ఇప్పటికీ అదే వాడుతున్నారు.

పేకేటి రంగా మన పేకేటి శివరాం (దేవదాసులో భగవాన్)గారి తనయుడు. పెద్ద ఆర్ట్ డైరెక్టర్, నా అదృష్టం కొద్దీ నా 'ఎవరే అతగాడు' సినిమాకి ఆయనే ఆర్ట్ డైరెక్టర్.

ప్రతాప్ ఆర్ట్స్ అధినేత రాఘవగారూ, (ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య సినిమాలో మొదటిసారి గొల్లపూడి మారుతీరావుగారిని నటుడిగా మార్చిన నిర్మాత) వాళ్ళ అబ్బాయి మా ముందు కూర్చున్నారు. రాఘవగారు శతాయుష్షు సంపన్నులట. నూట రెండో సంవత్సరం అని వారి అబ్బాయి చెప్పాడు. (ఆయన ఎయిర్ పోర్ట్‌లో నడిచిన నడక చూస్తే మీరు నమ్మరు) నిజంగా వందేళ్ళ తెలుగు సినిమాని మాతో వెంటబెట్టుకుని తీసుకెళ్తున్నట్లు అనిపించింది. "మంచి కథ చెప్పమ్మా. మళ్ళీ సినిమా తియ్యాలనుంది" అని రాఘవగారు అంటే, నాకు పూర్వం వాళ్ళ అంకితభావానికి భక్తి కలిగింది.

ఫ్లయిట్ ఆకాశంలోకి ఎగిరినప్పటి నుండీ అంతా నవ్వుతూ, కబుర్లతో ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఉండకుండా గోల గోల చేసారు.

చలపతి రావుగారు లేచి అందరి సీట్ల దగ్గరకీ వచ్చి పలకరించి, నవ్వించి తిరుగుతూనే ఉన్నారు.

"ఈయన ఎన్నేళ్ళనుండీ ఉన్నాడండీ సినిమాలలో?" అని నేను రాజుగారితో అంటే "ఎన్.టి.ఆర్ గారి సినిమాల్లో నాలుగైదు వేషాలు కూడా వేసేవాడు" అన్నారాయన నవ్వుతూ. "ఎస్.బాస్" అంటూ విలన్స్ డెన్‌లో క్రూరంగా కనిపించే చలపతి రావుగారు నా సినిమాల్లో చాలా వాటిల్లో ఉండడం వల్ల నాకు బాగా తెలుసు. చాలా మంచి వ్యక్తి. సాయం చెయ్యడానికి వెనుకాడని మనిషి.

డా.రాజశేఖర్ లేచి నిలబడి (జీవిత పక్కన లేకుండా) చాలా జోక్స్ వేసాడు. మనోజ్ వాళ్ళ నాన్న లేనందున పంచ కండువాతో తనే పెద్దరాయుడిగా కనువిందు చేసాడు. అతనికి పిల్లరాయుడని పేరు పెట్టుకున్నాను.

మేము పదకొండున్నరకి చెన్నైలో దిగేసరికి కార్లు సిద్ధంగా ఉన్నాయి. ఎయిర్ పోర్ట్‌లోంచి బయటకి వస్తున్న తారలతో ఫోటోలు దిగేవాళ్ళూ, ఆటోగ్రాఫ్‌లు తీసుకునే వాళ్ళతో కోలాహలంగా మారింది.

అందర్నీ ఐదు నక్షత్రాల హోటల్ 'లీ మెరిడియన్'లో దింపారు. నాతో బాటు వచ్చిన పెద్దవాళ్ళకి చెన్నై గాలి తగలగానే ప్రాణం లేచి వచ్చినట్లయి "ఎంతకాలం అయింది మన ఊరు వచ్చి" అని ఒకరితో ఒకరు ఆనాటి ఆనందాలు పంచుకున్నారు. రాఘవగారు దారంతా నాకు మద్రాసు గొప్పదనం చెపుతూనే ఉన్నారు కార్లో.

మేం వెళ్ళేసరికి "రండి రండి" అంటూ స్వాగతం చెప్పిన పెద్దలు గొల్లపూడిగారూ, విశ్వనాథ్‌గారూ, గణేష్ పాత్రోగారూ, ఒకర్ని చూసి ఒకరం ఎంతో సంతోషించి ముచ్చటిస్తూ ఉండగా నేను "అయ్యో నా సూట్ కేసు అంకుల్" అన్నాను.

"మళ్ళీ పోయిందా?" అన్నారు మారుతీరావుగారు. ఆయనతో అమెరికా వెళ్ళినప్పుడు కూడా నా సూట్‌కేస్ వారం రోజులు మిస్ అయి దొరికింది. ఈలోగా రూమ్స్ ఎలాట్ అయ్యాయి. నా సూట్‌కేస్ ఉన్న కారు కోసం మేనేజర్లు వాకబు చేస్తుండగా, రాఘవ గారి అబ్బాయి "హమ్ ఏక్ షెహర్ కా హై, ఇస్ లియే మై లా యాహూ!" అంటూ తెచ్చి ఇచ్చాడు.



రాజశేఖర్ వచ్చి "అయినా, నేనూ కోడి రామకృష్ణగారూ, మీ ముందు ఉండగా మీకేం భయం? మేం ఇక్కడ లేకపోతే భయపడాలి, మేం దొబ్బేస్తామని" అని మళ్ళీ 'నిండా' జోక్స్ వేసాడు. జీవిత ఇద్దరు పిల్లలతో హడావిడిగా కనిపించింది. రానా, నరేష్, మనోజ్, వెంకటేష్, రాజేంద్రప్రసాద్, మురళీమోహన్, కృష్ణం రాజు, కృష్ణకుమారి, జమునా రాణి అంతా మా హోటల్లోనే దిగారు అని తెలిసి చాలా సంతోషించాం. మారుతీరావుగారు కోడి రామకృష్ణగారు తనని ఎలా బలవంతంగా వేషం వేయించిందీ మాకు చెపుతుంటే, అప్పుడు తనకి స్క్రిప్ట్ రాయడం ఎగ్గొట్టి ఎలా వెళ్ళిపోయిందీ విశ్వనాథ్ గారు చెప్పుకొచ్చారు. గణేష్ పాత్రో గారితో నేను 'పావలా', 'కొడుకు పుట్టాలా' నాటకాల గురించి మాట్లాడితే ఆనందపడ్డారు. తన 'ఇల్లు అలికిన ఈగ' నాటకం మన దూరదర్శన్ వాళ్ళు పోగొట్టారని కోటా బాధపడ్డారు. 'లీ మెరిడియన్' ఫైవ్ స్టార్ హోటల్ కాదు, హండ్రెడ్స్ ఆఫ్ స్టార్స్ హోటల్‌లా భాసిల్లింది.

రావు బాలసరస్వతి గారు ఒకప్పుడు హీరోయిన్ గా నటించి సొంత గాత్రంతో పాడుకున్న గాయని. ఆవిడ పేరు చెప్పగానే 'నల్లని వాడా నే గొల్లపిల్లనోయి ఉల్లము రంజిల్లగా' అనే పాట గుర్తుకొస్తుంది. ఆవిడతో పాటున్న కృష్ణవేణిగారు మనదేశం సినిమాలో మన నటరత్న ఎన్.టి. ఆర్ ని పరిచయం చేసిన గొప్ప నిర్మాత. (వీరిద్దరిని గొల్లపూడి మారుతీరావుగారి ప్రక్కన ఫోటోలో చూడచ్చు)

అందరం లంచ్‌కి బఫేకి వెళ్ళాం. గొల్లపూడిగారి మనవరాలు శివానీ వచ్చింది. రానా, బాలకృష్ణ, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్ అందరూ మా దగ్గరకొచ్చి ప్రేమగా పలకరించి వెళ్ళారు.

ఇంతలో మా డా.రామనాయుడుగారు కనిపించారు. "నేను ఏం తినాలో చెప్పు రమణీ" అన్నారు.

ఆయనకి ఆ వంటకాలు అర్థం అయ్యేట్లు చెప్పి వడ్డించాను. కబుర్లు ఎక్కువగా భోజనం తక్కువగా చేసాం.

ఏ.సీ రూమ్స్ ఇచ్చినా సత్యానంద్ గారూ, గొల్లపూడిగారూ, విశ్వనాథ్ గారూ, గణేష్ పాత్రోగారూ, వడ్డేపల్లి కృష్ణగారూ, తోటపల్లి సాయినాథ్, మాడాగారు అందరం లాబీలో కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాం. "దీన్నే లాబీయింగ్ అంటారు" అన్నారు సత్యానంద్‌గారు.

పాతరోజుల్లో సినిమాల గురించీ, షూటింగ్‌లలో జరిగిన సరదా సంఘటనల గురించీ పెద్దవాళ్ళు మాట్లాడుతుంటే, చిన్నపిల్లల్లా ఒకరిని ఒకరు ఆట పట్టించుకుంటుంటే నాకు భలే తమాషాగా అనిపించింది. ఎంతో ఆనందంగా అనిపించింది.

రాఘవగారు గురించి చెపుతూ 'వందేళ్ళ సినిమా' మన మధ్యే ఉందమ్మా అన్నారు గొల్లపూడిగారు. బాలకృష్ణ వచ్చి "If you trouble the trouble the trouble troubles you" అని టంగ్ ట్విస్టర్స్ చెప్పి అలరించారు.

భువనచంద్రగారు, మురారి కాట్రగడ్డగారు ఫోన్ చేసి వాళ్ళ ఇంటికి రాకుండా వెళ్ళద్దని నన్ను శాసించారు.

మేనేజర్లు నిమిషం తీరిక లేకుండా తిరుగుతూ మా అందరికీ సాయంత్రం ప్రోగ్రామ్‌కి పాస్‌లూ, కార్లూ ఎరేంజ్ చేస్తూనే ఉన్నారు.

అందరం గదులకి వెళ్ళి సాయంత్రం ఐదుగంటలలోపే తయ్యారయి లాబీలో కొచ్చి రెడీగా ఉన్నాం.

నేను ప్రోగ్రాం హాల్‌కి సిరివెన్నల సీతారామ శాస్త్రిగారూ, వాళ్ళావిడతో వెళ్ళాను. మా వి.ఎన్ ఆదిత్య ఆల్‌రెడీ ఏర్పాట్లు చూడడానికి ముందుగా వెళ్ళి అక్కడే ఉన్నాడు. మేం రెడ్ కార్పెట్ ఉన్న వైపున కాకుండా ఇంకో గేటులోకి వెళ్ళాం. కె.యస్. రామారావుగారు ఎదురొచ్చి ఆహ్వానించారు.

లోపలికి వెళ్ళాక, అవార్డు ఉన్న వాళ్ళని ముందు వరసలో కూర్చోపెట్టారు. నేనూ, సుద్దాల అశోక్ తేజగారి మిసెస్ నిర్మలగారూ ఒక చోట కూర్చున్నాం. పాత తరం హీరోయిన్లు బి. సరోజ, కృష్ణకుమారీ, రాజశ్రీ కాంచనా, రాధా, అంబికా, వాణిశ్రీ మాధవీ కనువిందు చేసారు. కమలహాసన్, బాలచందర్ గార్లు వచ్చారు.



శివమణి డ్రమ్స్‌తో చెవుల తుప్పు వదలగొట్టాడు. ఆ తరువాత ప్రోగ్రామ్స్‌లో పాటలు కొంచెం శృతిమించాయి(దాదాపు గంటన్నర పాటు సాగిన ఆ మెడ్లీ పిచ్చెక్కించేసింది). సునీతా, శ్రీకృష్ణా, గీతామాధురీ, రవివర్మ ఇంకా మా టీవీలో కనపడే చాలా మంది సింగర్స్ వందేమాతరంతో సహా అటు పదిహేనుమందీ, ఇటు పదిహేనుమందీ నిలబడి ఒకరు ఆపితే ఒకరు అందుకుని పాడుతుంటే, ప్రేక్షకులు భరించలేక 'హాహా కారాలు' పెట్టారు. (అదంతా రికార్డెడ్ ట్రాక్ అని బాలూగారు తర్వాత చెప్పారు).

ఆర్. నారాయణమూర్తి ఆవేశంగా లేచి స్టేజ్ మీదకెళ్ళి సుమంగళి చేతిలోంచి మైక్ లాక్కున్నాడు. తెలివిగా నిర్వాహకులు మైక్ సౌండ్ తీసేసారు. అయినా అతను ఆగలేదు. రెండోసారి మళ్ళీ బాలుగారు మాట్లాడుతుండగా వచ్చి "ఇది వందేళ్ళ పండుగలా లేదు ఆడియో ఫంక్షన్‌లా ఉంది" అని అరిచి గోల చెయ్యబోతుంటే, జాగ్రత్తగా అతన్ని స్టేజ్ దింపేసారు. సి.కళ్యాణ్‌గారు (సౌత్ ఇండియన్ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షులు) నారాయణమూర్తిగారిని వందేళ్ళ పండుగలోంచి తొలగిస్తున్నాం" అని సింపుల్‌గా ప్రకటించేసాడు.

రాఘవగారి లాంటి వయసు మళ్ళిన పెద్దల్ని కూడా సన్మానానికి చివరిదాకా ఉంచడం లాంటి చిన్న చిన్న తప్పులతో మొత్తానికి ప్రోగ్రాం అయింది.

రాఘవగార్నీ, అరవింద్ గార్నీ, గొల్లపూడి గార్నీ, సత్యానంద్ గార్నీ, అశ్వనీ దత్తుగార్నీ, సుద్దాల అశోక్ తేజ గార్నీ మొత్తం సీనియర్ నటీనటుల్ని అందర్నీ సత్కరించడం అయ్యేసరికి పన్నెండు అయింది. అశ్వినీదత్ గారూ, అరవింద్ గారూ తమకార్లో నన్ను హోటల్ దగ్గర దింపి వెళ్ళారు.

హోటల్‌కి వెళ్ళి మళ్ళీ బఫేలో ఫ్రూట్స్, పెరుగన్నం తిని రూమ్ కెళ్ళి పడుకున్నాను.

మర్నాడు బ్రేక్ ఫాస్ట్ దగ్గర మళ్ళీ అంతా కలిసాం. నిన్నరాత్రి కబుర్లతో, సరదాగా బ్రేక్ ఫాస్ట్ చేసాక, సత్యానంద్ గారు నన్ను "మీరు ఫేస్‌బుక్ అప్‌డేట్స్ అంత తొందరగా ఎలా చేస్తారూ? ఫలానా సీరియల్‌లో ఈ నటి అద్భుతంగా చేస్తోంది అని మీరు ఫేస్‌బుక్‌లో పెట్టేలోపున ఆనటి వెళ్ళిపోదా?" లాంటి ప్రశ్నలు వేసి, "మీరు ఎఫ్.బిలో పెట్టేదాకా నాకు తెలీనే తెలీదు. వాళ్ళంతా మన ఫ్లైయిట్‌లోనే వస్తున్నట్లు" అని నా ఫేస్ బుక్ గురించి ఆట పట్టించారు.

"మీరు నా సినిమా కథల గురించి ఎంతైనా రంధ్రాన్వేషణ చెయ్యండి. మిగతా విషయాలు వదిలెయ్యండి" అన్నాను.

"అలాక్కాదు. మీకు సంబంధించినంత వరకూ అన్ని విషయాల్లో అలా చర్చిస్తేనే నాకు ఆనందం" అన్నారు.

భువన చంద్రగారింటికి వెళ్ళడానికి అరవింద్ గారు కారు పంపిస్తానన్నారు నాకు. కానీ ఆయనకి పన్నెండింటి ఫ్లైట్ కాన్సిల్ అయి రెండింటికి దొరికిందట. నాకు ఆలశ్యం అవుతుందని భువనచంద్రగారే తన కారు పంపారు.

నా ఈ ట్రిప్‌లో ఇది అత్యంత ఆనందకరమైన సంఘటన. భువనచంద్ర దంపతులు నన్ను ఒక ఆడబిడ్డని చూసినట్లు చూసి, ఎంతో ఆదరించారు.



ఆయన కొన్ని వందల ఫోటోలు చూపించారు. ఆకుమీద పడుతున్న వర్షపు చినుకు, ఆకు వెనకాల పురుగు పెట్టిన గుడ్లు, తన పూజామందిరంలో మోక్షం పొందిన బల్లి, అప్పుడే విచ్చుకున్న పువ్వు, సూర్యకిరణం సోకిన పచ్చిక.. ఆయనకి దీపావళినాడు పసిపిల్లలు బాణాసంచా చూసుకున్నట్లు తన ఫోటోల కలెక్షన్ చూసుకోవడం గొప్ప ఆనందం. వందలాది అవార్డులు, వేలకొలదీ ఉన్న ఆయన రాసిన పాటల కేసెట్స్, రాసిన డైరీలు, కలెక్ట్ చేసి గ్రంధాలయంలో బధ్రపరచుకున్న పుస్తకాలు అన్నీ శ్రద్ధగా చూపించారు.

అస్వస్థతగా ఉన్నారని తెలుసు. నీరసంగా బెడ్‌మీద ఉంటారనుకుంటే ఉత్సాహంగా తిరుగుతూ నాకు ఇంట్లో ప్రతి అణువూ చూపించారు.

స్రామాజ్యలక్ష్మిగారు అద్భుతమైన తెలుగు వంటలు చేసారు. షడసోపేతమైన భోజనం పెట్టారు.

నేను భువనచంద్రగారింటికి బయలుదేరుతూ మురారిగారికి ఫోన్ చేసి, "మీ ఇంటికి రాలేను. సాయంత్రం మీరే రండి. మీకో బహుమతి తెచ్చాను" అని చెప్పాను.



నేను వస్తుండగా ఆదిత్య ఫోన్ చేసి "నేనూ సిరివెన్నెలగారూ బాపుగారి ఇంటికి వెళ్తున్నాం" అని చెప్పాడు.

వాళ్ళు బాపూగారింటినుండి సరాసరి భువనచంద్రగారింటికి వచ్చేసారు. సాయంత్రం ఐదింటికి వాళ్ళ ఫ్లైట్. సిరివెన్నెలగారూ, భువనచంద్రగారూ ఒకరికొకరు గట్టిగా కౌగిలించుకున్నాక, ఆయన "మంద... మంద..... అంతా భువనచంద్ర ఆరోగ్యం కోసం ఆ దేవుడ్ని ప్రార్థించారమ్మా అందుకే కోలుకున్నాడు" అన్నారు.

ఇది నిజం. మా అమ్మ భువన చంద్రగారి ఆరోగ్యం కోసం దివ్యపూజని ప్రారంభించి బాబాకి ఇంకా చేస్తూనే ఉంది. ఆయనే స్వయంగా ఫోన్ చేసి "స్కానింగ్ లో అంతా బావుందని వచ్చిందమ్మా. ఆ దేవుడికి ఎన్ని గుండెలు, మన అమ్మ ఇన్ని పూజలు నాకోసం చేస్తుండగా" అన్నాక ఆవిడ స్థిమిత పడింది.



తరువాత సిరివెన్నెలగారితో కలిసి నేను కూడా లీ మెరీడియన్‌కి బయలుదేరిపోయాను. వారింట్లో తీసుకున్న ఫోటోలు కొన్ని ఎప్పటికీ దాచుకోవాలి. అందులో సంవత్సరం పొడుగూతా పూత పూసి, పండ్లు కాచే వేపచెట్టు ఒకటి. సుబ్బులు అని పిలవబడే మిసెస్ భువనచంద్రగారు నాకూ, సిరివెన్నెల గారి భార్య పద్మావతిగారికీ చీరలు పెట్టి పంపించారు.

"నీకు ఈ అన్నయ్యే కాదు, హైదరాబాద్‌లో ఇంకో అన్నయ్య ఉన్నాడని మర్చిపోకమ్మా" అన్నారు

సిరివెన్నెల.

"ఆవిడ మా ఇంటికే ఆడబడుచే" అన్నాడు వి.ఎన్.ఆదిత్య. నా కబుర్లు విని "అల్లరి కృష్ణమ్మ" అని నాకు పేరు పెట్టారు సిరివెన్నెల. అప్పటికప్పుడు పాట కూడా పాడారు.

మళ్ళీ నేనూ, ఆదిత్యా లీ మెరీడియన్ కొచ్చి లాబీయింగ్ చేస్తుండగా, సత్యానంద్ గారొచ్చారు. సాయంత్రం అక్కినేని నాగేశ్వర రావుగారి పుట్టినరోజు సెలెబ్రేషన్స్‌కి కాకతీయ షెరాటన్‌లో మళ్ళీ పాస్‌లు పట్టుకొచ్చి ఇచ్చారు మేనేజర్లు.

నేను బర్త్‌డే పార్టీకి తయ్యారవడానికి పైకి వెళ్ళగానే మురారీ క్కాటగడ్డగారు వచ్చి క్రింద లాబీ నుండి రమ్మని ఫోన్ చేసారు.

మళ్ళీ విశ్వనాథ్ గారూ, రావికొండలరావుగారూ, సత్యానంద్‌గారు, గణేష్ పాత్రోగారు, వడ్డేపల్లి కృష్ణగారూ, గొల్లపూడిగారూ, మురారిగారూ నేనూ అంతా రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్.



ముందరి రోజు మురారి గారి పేరు అవార్డ్‌కి పిలిచారు. ఆయన రాలేదు. ఇక్కడ మాత్రం నేను ఆయన కోసం తెచ్చిన ఆవకాయ అందుకుని "ఈ ప్రేమతో ఇస్తున్న అవార్డు నాకెంతో ఆనందం" అన్నారు.

నేను ఎంతో వెతికి కొని తీసుకొచ్చిన వెండి సరస్వతీ దేవిని భువనచంద్రగారి సతీమణికి ఇచ్చాను. మురారి గారి భార్యకి వినాయకుడిని పంపించాను. ఆవిడ ఎంతో ఆనందపడ్డారట.



మురారిగారు మిగతా వాళ్ళతో, నా ఫేస్‌బుక్ వంటల గురించి తెగ చెప్పారు. "ఈవిడ నేర్పించిన వెల్లుల్లి పప్పు పులుసూ, కందా బచ్చలీ మా ఆవిడకి ప్రింట్ అవుట్ తీసిచ్చాను. అసలు ఆ పప్పుచారు తింటుంటే అచ్చంగా మా అమ్మ పెట్టినట్లు అనిపించిందమ్మా. మా ఆవిడా, వంటమనిషీ మీరు మా ఇంటికి రాలేదని చాలా డిసప్పాయింట్ అయ్యారు" అని చెప్పారు. వాళ్ళ ఇల్లు బీచ్ దగ్గరగా ఉండి సాయంత్రాలు చాలా బావుంటుందట. మళ్ళీసారి వస్తే అక్కడే (నీలాంగర్ అని మహాబలిపురం వెళ్ళే దారిలో) దిగాలని మాట తీసుకున్నారు.

అందరం బయలుదేరి కాకతీయాలో అక్కినేనిగారి బర్త్‌డే పార్టీకి వెళ్ళాం.




అక్కడ నా కళ్ళు సరిపోనంత అందం. మన అలనాటి తారలు జయంతి, కాంచన, వాణిశ్రీ, గీతాంజలి, ప్రభ, జయసుధ, రాధ, అంబిక, సుహాసిని ఇంకా ఎందరెందరో. ముఖ్యంగా సావిత్రిగారి అమ్మాయి విజయ చాముండేశ్వరితో ఫోటో తీయించుకున్నాను. ఆవిడతో ఫోటో తీయించుకుంటే సావిత్రి గారితో ఫోటో తీయించుకున్నంత ఆనందం వేసింది.

మా గురువుగారు పరచూరి గోపాలకృష్ణగారు, పోకూరి బాబూ రావుగారు అందరం ఒకచోట కూర్చున్నాం రేలంగి నరసింహారావుగారూ, కోడిరామకృష్ణగారూ, భీమినేని శ్రీనివాసరావుగారూ, వందేమాతరం శ్రీనివాసరావుగారూ, సాయికుమార్ అంతా రౌండ్‌గా టేబుల్ దగ్గర కూర్చున్నాం. వచ్చిన ప్రతివాళ్ళూ మొదటగా మమ్మల్ని పలకరించే లోపలికి వెళ్ళారు.

మొదటగా కాక్ టెయిల్స్, తర్వాత డిన్నర్ స్టార్ట్ అయింది. అప్పుడొచ్చారు నాగేశ్వరరావుగారూ, ఆయన కుటుంబం. వాళ్ళకి స్పెషల్ చార్టెడ్ ఫ్లైట్ వేయించారట.

మలయాళీ నటుడు మధుకి కూడా జన్మదిన వేడుకలు జరిపారు. అంతా గోలగోలగా మారింది. మేం మాత్రం త్వరగా భోజనాలు చేసి బయలుదేరాం. "తాగే వాళ్ళతో ఎక్కువ సేపు ఉండకూడదమ్మా, మనసులో ఎప్పుడెప్పుడో దాచుకున్నవన్నీ తన్నుకొచ్చి గొడవపడతారు" అన్నారు గోపాలకృష్ణగారు. మేం త్వరగానే వచ్చేసాం.

మర్నాడు అందరం కలిసి బ్రేక్ ఫాస్ట్ చేసి ఎయిర్ పోర్ట్‌కి బయలుదేరాం. నేనూ కోటాగారూ, తరుణ్ ఒక కారు ఎక్కాం. తరుణ్‌తో నేను ఫోటో తీసుకున్నాక నా భుజానికి ఉండే బ్యాగ్ లేదని గమనించి 'కెవ్వుమన్నాను' కోటాగారు 'కంగారుపడకమ్మా ఫైవ్ స్టార్ హోటల్లో ఎక్కడికీ పోదు" అన్నారు. వెనక్కి వెళితే ఫ్లైట్ మిస్ అవడం ఖాయం. బ్యాగ్ లో క్రెడిట్ కార్డ్సు, జ్యువెల్రీ, కొంచెం క్యాషూ ఉన్నాయి.

మా మేనేజర్లు వెంటనే వెతికి "అమ్మా మీ ఐడెంటీ కార్డు ఉంది. ఇది మీదే వడ్డేపల్లి కృష్ణగారికిచ్చి పంపిస్తున్నాం" అన్నారు. మేనేజర్లు ఎంత బాగా చూసారో మమ్మల్ని చెప్పలేను.

మేం ఎయిర్‌పోర్ట్ చేరిన పదినిమిషాలకి బ్యాగ్‌తో కృష్ణగారొచ్చారు. తరుణ్, కోటాగారూ నాకు ధైర్యం చెపుతూనే ఉన్నారు. సుధాకర్, అక్కినేని ప్రసాద్, వర్మ, మోహన్ అన్న ఆ మేనేజర్లకి నా కృతజ్ఞతలు. శ్రీకాంత్, నరేష్, శివాజీరాజా అంతా కూడా నాకు బ్యాగ్ వచ్చేవరకూ ఎయిర్ పోర్టులోకి వెళ్ళకుండా నాకు తోడుగా ఉన్నారు. మేమంతా ఒకటే అన్న భావన ప్రతి వాళ్ళలో ఆ మూడు రోజులూ కనిపించింది.

చిన్న చిన్న అపశృతులు చాలా జరిగి ఉంటాయి. అయినా ఇది ఒకరింట్లో పెళ్ళికాదు. అందరి 'అమ్మ'కి పుట్టినరోజు పండగ. నిర్వాహకులకి కృతజ్ఞతలు. ఎంతో బాగా చేసారు. ఎంతో బాగా చూసారు.

**జై జై సినీ కళా మాతల్లీ!**

Post your comments




జమునారాణిగారితో
జయంతిగారితో


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి